# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 16 ఏప్రిల్ , 2026 | పేజీలు : 06


## వరి కొనుగోలు కేంద్రాల ట్యాబ్ ఆపరేటర్లకు శిక్షణ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వరి కొనుగోలు కేంద్రాల ద్వార కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని అదేరోజు ట్యాబ్ ఎంట్రీ పూర్తిచేసి,మిల్లుకు సరఫరా వరకు ఒపిఎంఎస్‌లో అప్డేట్ చేయాలని,ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని డీఆర్‌డీఓ వై.శేఖర్ రెడ్డి హెచ్చరించారు. జిల్లాలో డీఆర్‌డీఏసెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాల ట్యాబ్ ఆపరేటర్లకు ఆన్‌లైన్ ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం జిల్లాలో గ్రామ సంఘాల ఆధ్వర్యంలో 25 మండలాల్లో ఇప్పటివరకు 169 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.తేమ శాతం 17 శాతం లోపు ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని,ప్రతి కొనుగోలు కేందంలో సీరియల్ నెంబర్ ప్రకారం మాత్రమే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని,40కిలోల 700 గ్రాముల మేర మాత్రమే తూకం వేయాలని పేర్కొన్నారు. హామాలీ ఛార్జీగా క్వింటాల్‌కు రూ.45మాత్రమే రైతుల నుంచి వసూలు చేయాలని,అదనపు డబ్బులు లేదా ధాన్యం వసూలు చే యరాదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీపీఎం (నాన్ ఫామ్) వీరయ్య,ఏపీఎంలు బాషపాక చంద్రశేఖర్, బి.శ్రీనివాస్,సివిల్ సప్లయ్స్ కార్యాలయ టెక్నికల్ పర్సన్ ఎం.డి.ముబీన్,సుకుమార్,మార్కెటింగ్‌లు శాంత, నాగలక్ష్మి,రేణుక, నిర్మల, స్వాతి, దీపిక పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు రావొద్దు

### సంబంధిత అధికారులకు నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచన



**ప్రజాపక్షం/దేవరకొండ :** రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం ఆయన దేవరకొండ ఎంఎల్ఏ బాలునాయక్‌తో కలిసి దేవరకొండ మండలంలోని కొండభీమనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల ప్రకారం ఉండే తక్షణమే కొనుగులు చేయాలని, ఎలాంటి ఆలస్యం చేయవద్దని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, విశ్రాంతి సౌకర్యాలు కల్పించాలని తేమ పరీక్షలు, గన్ని బ్యాగుల సరఫరా వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. మిల్లర్లతో సమన్వయం చేసుకొని కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం అమ్ముకోవడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా రైతులు వెంటనే సంబంధిత అధికారులకు తెలపాలని సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అన్నారు. అనంతరం మండలంలోని కొల్‌ముంతల్‌పహాడ్ బిసి బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను కలెక్టర్ బి. చంద్రశేఖర్ తనిఖీ చేసి పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, ఆహార నాణ్యతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పాఠశాలలోని ప్రతి గదిని పరిశీలిస్తూ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. డోర్లు, కిటికిలు బాగుండేలా చూసుకోవాలని, మూత్రశాలలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మోనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు. స్టోర్ రూంను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు హాజరు పట్టికను పరిశీలించి వారి ఆరోగ్యం, వసతి పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, పౌరసరఫరాల జిల్లా మే నేజర్ రాంపంతి నాయక్, డిసిఒ పత్య, బిసి వెల్ఫే ర్ ఆర్సివో స్వప్న ఉన్నారు.

**రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం..**

దేవరకొండ ప్రభుత్వ ఏరియా వైద్య శాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలపై ఆరా తీశారు. చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడారు. ఎక్కడి నుండి వచ్చారు ఏమైంది అని అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. దేవరకొండ పరిసర ప్రాంతాల నుండి వచ్చిన కొంత మంది రోగులు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఎక్స్‌రే విభాగాన్ని సందర్శించి, నడుమునొప్పితో వచ్చిన రోగులను ఎప్పుడు వచ్చారు, ఎక్స్‌రే తీశారా అని ప్రశ్నించారు. రోగులు గంటల తరబడి వేచి చూస్తున్నారని తెలుసుకున్న కలెక్టర్, ఆలస్యం ఎందుకు జరుగుతోందని సిబ్బందిని ప్రశ్నించారు. దేవరకొండలో తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూల్ స్థల పరిశీలన చేసిన కలెక్టర్, ఎంఎల్ఏ బాలునాయక్ గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమణాల మెరుగుకు తెలంగాణ మోడల్ స్కూళ్లు ఎంతో దోహదపడుతాయని కలెక్టర్ అన్నారు. బుధవారం కలెక్టర్, స్థానిక ఎంఎల్ఏతో కలిసి దేవరకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూల్ నిర్మాణం కోసం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐకి విరాళాలు ఇవ్వాలి


### గురజ రామచంద్రం పిలుపు

**ప్రజాపక్షం/మునుగోడు:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సిపిఐ కు ప్రజలు ఉదారంగా విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురజ రామచంద్రం పిలుపునిచ్చారు.సోలిపురం గ్రామంలో బుధవారం సిపిఐ విరాళాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి నిధులను సేకరించారు.ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ పేద ప్రజలకు కూడు,గూడు,నీడ వంటి ప్రాథమిక అవసరాల కోసం సిపిఐ నాటి నుండి నేటి వరకు నిరంతరం పోరాటాలు చేస్తోందని తెలిపారు.దేశానికి స్వాతంత్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్నా, గ్రామాల్లో ఇంకా మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ అనేక గ్రామాల్లో సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం,బస్సు సదుపాయం అందుబాటులో లేకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.పాలకవర్గాలు ఇప్పటికైనా గ్రామాలు, పల్లెల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలంటే సిపిఐకి ప్రజల మద్దతు అవసరమని,అందుకు విరాళాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి,మండల పార్టీ కార్యదర్శి చాపల శ్రీను,శాఖ కార్యదర్శి నకరకంటి సత్యనారాయణ,ఇరిగి యాదయ్య,వార్డు సభ్యులు ఎన్.రమేష్,అశోక్, లింగయ్య,అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రణాళికలు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సెర్ప్ సిబ్బందికి నిర్వహించిన ఉద్యమి ఆధార్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలాల్లో మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేస్తున్న చిన్న తరహా వ్యాపారాలకు సంబంధించిన ప్రగతిని ఆయన సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అందుకు తగిన విధంగా ప్రతి మండలంలో 10 నూతన వ్యాపారులను గుర్తించి జూన్ 2 వరకు గ్రౌండింగ్ చేయించాలని సూచించారు. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన వ్యాపారులకు సంబంధించి ఉద్యమి ఆధార్ సర్టిఫికెట్ అందించాలని సూచించారు. మహిళా సంఘ సభ్యులు చేస్తున్న కార్యక్రమాలకు ప్రభుత్వ మద్ధతు సంపూర్ణంగా లభిస్తుందన్నారు. ఉద్యమి ఆధార్ సర్టిఫికెట్ పొందడం ద్వారా చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి బ్యాంక్‌ల ద్వారా పెద్ద మొత్తంలో రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. ఉద్యమి ఆధార్ సర్టిఫికెట్ ద్వారా ప్రభుత్వ సహకారంతో పాటు ప్రభుత్వ టెండర్‌లలో పాల్గొనే అవకాశం లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ శిరీష, జిల్లా పరిశ్రమల అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్, శోభారాణి, డిఆర్‌డిఏ అదనపు సంచాలకులు సురేష్, ట్రైనర్ రాజు ప్రసాద్ పాల్గొన్నారు.

**16న నిర్వహించే మండల స్థాయి సమావేశాలకు ఏర్పాట్లు చేయాలి**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 16న నిర్వహించే మండల స్థాయి సమావేశములకు అన్ని ఏర్పాటు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వెబ్‌ఎక్స్ ద్వారా జిల్లా ఎస్‌పి కె. నరసింహ, ఆర్‌డిఓ, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఎపిఓ, ఏపిఎమ్, ఎమ్‌పిఓలతో మాట్లాడుతూ ఈనెల 16న నిర్వహించే మండల స్థాయి సమావేశాలలో ప్రస్తుత, రాబోయే ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. స్థానిక సమస్యలను, అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించాలని తెలిపారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్, అరైవ్ అలైవ్ థీమాటిక్ వీక్‌లో భాగంగా కార్యక్రమంలో సమావేశమైన ప్రజలకు హెల్మెట్లు, సీట్ బెల్టులు ధరించడం, ట్రాఫిక్ నియమాలు, రహదారి భద్రత జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పించాలన్నారు. దాంతోపాటు రోడ్డు భద్రతపై పౌరులతో ప్రతిజ్ఞ చేయించడం, మండల పరిధిలో గల ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చు పౌరులకు నో హెల్మెట్ నో ఎంట్రీ బోర్డులు విధిగా కార్యాలయాలలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, జిల్లా పరిషత్ సిఈఓ శిరీష, జిల్లా పంచాయితీ అధికారి యాదగిరి, హౌసింగ్ పిడి సిద్ధార్థ, డిఈఓ అశోక్, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, సంక్షేమ అధికారులు దయానంద రాణి, నరసింహ, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

# కెఆర్ఆర్ డిగ్రీ అడ్మిషన్లకు 'దోస్త్' నోటిఫికేషన్

**ప్రజాపక్షం/కోదాడ:** ఇటీవల తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ జారీ చేసిన దోస్త్ నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హడసారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతగా అడ్మిషన్ల కోసంగానూ ఏప్రిల్ 15వ తేదీ నుండి మే 7వ తేదీ వరకు రిజిస్టేషన్ చేసుకోవాలని, ఏప్రిల్ 30వ తేదీ నుండి మే 8వ తేదీ మద్యన వెబ్ ఆప్షన్స్‌లో భాగంగా కెఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, సీట్లు కేటాయించబడిన విద్యార్థులు మే 15, 23వ తేదీల మధ్య స్వయంగా కళాశాలలో రిపోర్టు చేయాలని కోరారు. ఏదైనా నెట్ సెంటర్లలో దోస్త్ రిజిస్టేషన్ చేసుకొనుటకుగానూ ఇటీవల కుల, ఆదాయ, ఆధార్, టెన్త్, ఇంటర్ మెమో, స్టడి కండక్ట్, ఫోటోతో పాటు ఆధార్ లింక్ ఉన్న మొబైల్ నెంబర్ కావాలని కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు.

# విద్యార్థులకు అవగాహన



**ప్రజాపక్షం/మునగాల:** రోడ్డు భద్రత నియమాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మునగాల సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా అవగాహన నిర్వహించారు. మానవ తప్పిదాల పట్ల అధిక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ డిఫెన్స్ డ్రైవింగ్ చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. విద్యార్థులు, యువత తప్పక రోడ్డు ప్రమాదాల నియమాలు పాటించాలని కోరారు. అంతకు ముందు విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాజీ వార్డు మెంబర్‌కు పరామర్శ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని గారకుంట తండా గ్రామానికి చెందిన మాజీ వార్డు నెంబర్ బాణోతు చిలకమ్మ ఇటీవల గర్భకోశ సర్జరీ చేయించుకున్నందున తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ నాయకులు గుగులోతు నీలా హేమ్లానాయక్ బుధవారం పరమార్శించి ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిరుపేదలకు, అభాగ్యులకు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సందీప్‌నాయక్, వెంకట్రాంనాయక్, బాలునాయక్, రవీందర్‌నాయక్, పులియానాయక్, కాలియానాయక్ పాల్గొన్నారు.

# ఉపా కేసులను ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుపై అక్రమంగా పెట్టిన దేశ ద్రోహం, ఉపా కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ హుజూర్‌నగర్ డివిజన్ కమిటి నాయకులు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోటు రంగారావు కేవలం కార్మికుల పక్షాన నిలబడి పోరాటే వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వాస పల్లయ్య, సయ్యద్ హుస్సేన్, కస్తాల కృష్ణన్న, వాస కరుణాకర్, అంబటి బిక్షం, వక్కవంతుల కిషోర్, రజాక్, చందనబోయిన లక్ష్మి, సయ్యద్ రేష్మా, శ్యామల, మరియమ్మ, మల్లేశ్వరి, అలివేలు, చెన్నమ్మ, సైదులు, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాధికారి భాను నాయక్‌తో కలిసి కళాశాల ప్రిన్సిపల్ పెరుమాళ్ల యాదయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, గదుల్లో విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, బెంచీలు, ఇతర ఫర్నీచర్ అవసరమైన జాబితాను సిద్ధం చేసి అందజేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే ఉచితంగా నాణ్యమైన ఇంటర్ విద్య అందుతుందని, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అత్యంత ఆధునికమైన ల్యాబరేటరీలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొనతం రాజేష్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, గునగంటి హేమ సతీష్, కళాశాల లెక్చరర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలు అరికట్టాలని వినతి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోని రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 153/2 గతంలో నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. గతంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు పూర్తి ఆధారాలతో విన్నవించగా ఆర్డీవో, తాసిల్దార్ కలెక్టర్ నిజమైన పట్టాదారులకు ప్లాట్లు చెందేటట్లు విచారణ చేసి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కానీ మండల స్థాయి అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది ఇప్పటికైనా అక్రమంగా పట్టా సర్టిఫికెట్లు సృష్టించి నిర్మాణం చేపడుతున్న వారిపై చట్టా రీత్యా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీడీవో ప్రమోద్ కుమార్‌కు ఈద మల్లయ్య వినతిపత్రం అందజేశారు. అక్రమ నిర్మాణాలపై అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కొందరు నకిలీ పట్టాలు సృష్టించి అధికారుల సహకారంతో నియమాలను అతిక్రమించి నిర్మాణాలు కొనసాగుతున్నయని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణంలో తక్షణమే నిలిపివేసి ఇప్పటికే నిర్మించిన వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధ్యులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# లక్ష్మమ్మ దశదిన కర్మలో సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోని కొత్తగూడెం సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ దోనూరి రత్నారెడ్డి సతీమణి దోనూరి లక్ష్మమ్మ దశదినకర్మలో సిపిఐ నేతలు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసిన ప్రజానాయకునికి సహచరిగా ఉంటూ గ్రామంలో సామాజిక కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న వ్యక్తిగా గుర్తింపు పొందారని అన్నారు. ఆమె సేవలను గుర్తు చేసుకుంటూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు ఇలాంటి సేవాభావం కలిగిన వ్యక్తులు సమాజానికి ఆదర్శం అని పేర్కొన్నారు. వినమ్రంగ జోహార్లు అర్పించారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, పల్లె గోపాల్ రెడ్డి బీసీ సంఘం నాయకుడు ఘనం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# వినూత్న ప్రచారం

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ మరియు రవాణా శాఖల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తునందున ఇట్టి వారోత్సవాల సందర్భంగా బుధవారం అడ్డగూడూరు మండల కేంద్రంలో అడ్డగూడూరు పోలీసు వారు గోవిందాపురం విన్సెంట్ పల్లోంటి స్కూల్ విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించి మానవహారాన్ని ఏర్పాటు చేసి స్థానికులకు ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా కంచనపల్లిలోని కస్తూర్బా బాలికల విద్యార్థులతోటి వారి తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించాలని సీట్ బెల్ట్ పెట్టుకోవాలని ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని తెలుపుతూ లెటర్ రైటింగ్ రాయించారని ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.



# ప్రథమ సంవత్సర అడ్మిషన్లు ప్రారంభం

**ప్రజాపక్షం/రామన్నపేట :** డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం దోస్త్ ఆన్లైన్ అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదలైందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలిపారు. మొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్ ఈనెల 15 నుండి మే 7 వరకు, వెబ్ ఆప్షన్ ఈనెల 30 నుండి వచ్చే నెల 8 వరకు చేసుకోవచ్చని అన్నారు. ఎక్కడో సుదూర ప్రాంతాల్లోని కళాశాలలో చేరకుండా స్థానికంగా ఉన్న డిగ్రీ కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవాలన్నారు. అన్ని అర్హతలు కలిగి అపార అనుభవం ఉన్న అధ్యాపకులు, విశాలమైన తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ తరగతి గదులు, గ్రంథాలయం, విశాలమైన క్రీడామైదానం, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వంటి సకల సదుపాయాలు కలిగిన కళాశాలలో తప్పకుండా చేరాలని వారు అన్నారు.



# లారీ యాజమానులపై ఆర్థిక భారం తగ్గించడం హర్షణీయం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఫిట్నెస్ ఛార్జీలు, గ్రీన్ టాక్సిలో లారీ యాజమానులపై ఆర్థిక భారం తగ్గించడం హర్షణీయమని హుజూర్‌నగర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోతి సంపత్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంచిరెడ్డి రాజేందర్‌రెడ్డి చిత్రపటాలకు హుజూర్‌నగర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోతి సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 15 సంవత్సరాలు దాటిన లారీలపై పిట్నెస్ ఛార్జీలు 20వేల నుండి 25వేల రూపాయల అధిక భారాన్ని మోపిన క్రమంలో ప్రభుత్వ పెద్దలను ఒప్పించి 11వేల రూపాయలకే పిట్నెస్ చేపించే విధంగా కృషి చేసి పాత విధానం తీసుకొచ్చే క్రమంలో ప్రభుత్వ పరంగా సహకరించిన మంత్రులకు, రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మంచిరెడ్డి రాజేంద్రరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు శంకర్‌రావు, ఇన్‌ఛార్జి సెక్రటరీ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ రామిశెట్టి శ్రీనివాస్, ట్రెజరర్ శ్రీనివాసరాజు, వసంత్ రెడ్డి, రవిరాజు, శివరామరాజు, శ్రీనివాస్, ఉదయ్, వెంకటేశ్వరరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలి



**ప్రజాపక్షం/చివ్వెంల :** మండలంలోని బండమీది చందుపట్ల గ్రామం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో ఎంపిడిఓకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ రవిని 2024 సంవత్సరంలో సస్పెండ్ చేశారన్నారు. మరలా ఈ సంవత్సరం అతన్ని నియమిస్తున్నామని చెబుతున్నారని ఇది ఎలా సాధ్యమన్నారు. అతను అనేక అక్రమాలకు అవినీతికి పాల్పడినట్లు జిల్లా విచారణ అధికారులు తేల్చి చెప్పి అతన్ని ఫీల్డ్ అసిస్టెంటుగా తొలగించడం జరిగిందన్నారు. గడిచిన మూడు సంవత్సరాలు పని దినాలు చేయకుండా వారం రోజుల నుండి నేనే ఫీల్డ్ అసిస్టెంట్‌ని నేను చెప్పిందే వేదం అన్నట్లు ప్రవర్తిస్తున్నారన్నారు. కావున ఫీల్డ్ అసిస్టెంట్లు తక్షణమే విధుల నుండి తొలగించాలని లేనియెడల వందలాది మందితో కలెక్టరేట్ కార్యాలయంలో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాషపంగు సునీల్, నల్లగొండ లింగయ్య, వీరబోయిన వెంకన్న, ఎల్లయ్య పాల్గొన్నారు.

# పేదల మొహంలో చిరునవ్వు చూడడమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్)) :** పేదల మొహంలో చిరునవ్వు చూడటమే మా ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆత్మకూర్(ఎస్) మండలంలోని మక్త కొత్తగూడెం గ్రామంలో పూర్తి చేసుకున్న 6 కుటుంబాల లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. ఈ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని 175 ఇండ్లను మంజూరి చేసి 80 ఇండ్లను పూర్తి చేసుకొని గృహప్రవేశం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాసాని పాపయ్య గౌడ్, చింతమళ్ల రమేష్, బాషాపంగు భాస్కర్, అబ్దుల్ రహీం, కొండపల్లి దిలీప్ రెడ్డి, తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి, ఎలిమినేటి అభినయ్ నాయుడు పాల్గొన్నారు.



# గిరిజన నాయకుడు బీర్ల

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** బొమ్మలరామారం మండల గిరిజన అభిమాన నాయకుడు ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అని తిమ్మాపురం మాజీ ఎంపీటీసీ ధీరావత శ్రీహరి నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఎండిఏ నిధుల ద్వారా కంచల్ తండా గ్రామానికి రూ.30 లక్షల 50 వేలు అండర్ డ్రైనేజ్ సిసి రోడ్లకు తను ఎంపీటీసీగా ఉన్న రోజుల్లో ఆ నిధుల మంజూరు కొరకు కోరగా హెచ్ఎండియ నిధుల ద్వారా మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతినిత్యం ప్రజల శ్రేయస్సు కోసం పరితపిస్తున్న ఎమ్మెల్యే అని ఆయన కొనియాడారు.

# శంకర్‌కు దళిత రత్న అవార్డు



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని చిన్న రావులపల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ ఉద్యమ నాయకుడు సోమవారం శంకర్‌కు దళిత రత్న అవార్డు వరించింది. ప్రతి ఏటా బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని వివిధ సేవలు అందించిన వారికి హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ జయంతి రోజునరాష్ట్ర ప్రభుత్వం వారు చేసిన సేవలను గుర్తించి దళిత రత్న అవార్డులను ప్రదానం చేశారు. అందులో భాగంగా సోమవారం శంకర్‌కు రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మ ణ్ చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ దొమ్మాటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# మానసికోల్లాసానికి క్రీడలు



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** యువత చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనాలని అవి వారి మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి అని మండల ఎల్‌హెచ్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి సోలిపేట వార్డు మెంబర్ దీరావతి స్వామి నాయక్ అన్నారు. మండలంలోని సోలిపేట గ్రామపంచాయతీ పరిధిలోని రాముని తండాలో శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ ధీరావత్ స్వామి నాయక్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.5000 వారి సొంత నిధులతో గెలుపొందిన యువకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తండా ప్రజలు ఎల్‌హెచ్‌పిఎస్ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులను పరిశీలన

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** మండల కేంద్రంలో జరుగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా యాస లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వివరించగా స్పందించిన బీర్ల ఐలయ్య బిటి రోడ్డు బదులు సీసీ రోడ్డు వేసి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కి అధికారులకి సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పోతగాని మల్లేశం గౌడ్, స్థానిక వార్డ్ మెంబర్ బూడిద శేఖర్, ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఎలగందుల మహేష్ పాల్గొన్నారు.

# ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగే ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడివో మల్సూర్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 16న జరిగే 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో మండల స్థాయి అధికారులు హాజరై వారికి సంబంధించిన పూర్తి నివేదికను పొందుపర్చాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ మహిళ శక్తి, కొత్త రేషన్‌కార్డులు, సన్నబియ్యం అభివృద్ధి పథకాలపై విచారణ, నూతనంగా ప్రవేశ పెట్టే పథకాల విద్యార్థులకు బ్రేక్‌పాస్ట్ పథకం, రాగి జావ, మిడ్‌మే మిల్స్, మైనార్టీస్ ఫథకాలు సహజ అర్గానిక్, వ్యవసాయం, ఇందిరమ్మ జీవితం బీమా అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

# వడదెబ్బకు జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** వడదెబ్బ లక్షణాలు, శరీర ఉష్ణోగ్రత ఎక్కువ అవ్వడం, తలనొప్పి, తల తిరగడం వాంతులు, అధిక చెమటలు ఉంటాయని గరిడేపల్లి ప్రాధమిక వైద్యాధికారి డాక్టర్ వి.నరేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తలనొప్పి, తల తిరగడం వాంతులు, అధిక చెమటలు పడితే వెంటనే ఆరోగ్య కేంద్రానికి రావాలన్నారు. నివారణ చర్యలుగా ఎక్కువగా నీరు తాగాలన్నారు. నిమ్మరసం, మజ్జిగ తాగలన్నారు. మద్యాహ్నం 12 గంటల నుండి నాలుగు గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండటం చాల మంచిదన్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రతరంగా ఉన్న దృష్ట్యా బయట పనులు తొందరగా ముగించుకోవాలని అన్నారు. తప్పని సరిగా బయటకు వెళ్లాలనుకుంటే గొడుగు, టోపి లేదా చేతి రూమాలను తలపై ఉంచుకోవాలన్నారు. గ్రామాలలో ఆశా కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అప్రమత్తంగా ఉండాలన్నారు.

# రఘుమారెడ్డి జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** కొండమల్లేపల్లి గ్రామ సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి తండ్రి కి.శే. పసునూరి రఘుమారెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులందరు కలిసి కొండమల్లేపల్లి పట్టణంలోని బస్టాండ్‌లో బుధవారం చలివేంద్రంను ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రంను కి. శే. పసునూరి రఘుమారెడ్డి భార్య మాజీ జెడ్పిటిసి సభ్యురాలు పసునూరి సరస్వతమ్మ వారికుటుంబ సభ్యులు, మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యుగేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు మాజీ జెడ్పిటిసి పసునూరి సరస్వతమ్మ, వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టిరెడ్డి



విజయ్‌రెడ్డి, మండల అధ్యక్షులు ఊట్కూరి వేమన్‌రెడ్డి, ఎంఈవో నాగేశ్వర్‌రావు, మాడ్గుల యాదగిరి, పంచాయతీ కార్యదర్శి డాకునాయక్ పాల్గొన్నారు.

# కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలి





**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నేరేడుగొమ్ము మండల పరిధిలోని కొత్త పల్లి గ్రామంలో బుధవారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ రైతులు పండించిన వడ్లకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం



కట్టుబడి ఉందని తెలిపారు.

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతులకు పెద్ద పీట వేస్తుందని, యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కొండాపురం సర్పంచ్ కొప్పుల వెంకట్ రెడ్డి అన్నారు. ఆయన బుధవారం మండలంలోని కొండాపురంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కెంద్రాన్ని ప్రారంభించారు. మేడికుంటపల్లి, దిలావర్పూర్, ఇక్కుర్తి, కొండాపూర్, వర్టూర్ చామాపూర్, కదిరేణి గూడెం, నాంచారి పేట తదితర గ్రామాలలో దాన్యం కోనగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజేంద్రప్రసాద్, ఆర్ఐలు రామారావు, అసిఫ్, ఏవో మధులత, ఏఈఓ వెంకటేష్, శ్వేత, ఏపిఎం ఆనంద్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** నాణ్యమైన వడ్లు తెచ్చి మద్దతు ధర పొందాలని చేర్యాల సర్పంచ్ మంత్రి లతా స్వామి అన్నారు. మోటకొండూర్ మండలంలోని తేర్యాలలో పిఏసిఎస్ ఆత్మకూర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి వరి దాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సామ భూపాల్ రెడ్డి, పిఏసిఎస్ సిఇఓ యాస కిరణ్ రెడ్డి, ఉపసర్పంచ్ బాజ మోహన్, రైతులు భూరెడ్డి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

మోటకొండూర్ మండలంలోని నూతన గ్రామపంచాతీ పెద్దబాయి శాఖంపల్లిలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆలేరు ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రం మంజూరు కాగా సర్పంచ్ వేల్పుల రజిత శ్రీరాములు తహసీల్దార్ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.





# మహిళా సమాఖ్య సంఘ భవనం ప్రారంభం

**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నేరేడుగొమ్ము మండల పరిధిలోని కొత్త పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య సంఘ భవనాన్ని బుధవారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ మహిళా సంఘాలు మరియు ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు సొంత భవనాలు అవసరం అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి , స్వయం ఉపాధి అవకాశాల పెంపు దిశగా కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రతి పనికి తన వంతు కృషి చేస్తానని, మహిళల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఎంఎల్‌ఏ బాలునాయక్ హామీ ఇచ్చారు.

# దాహం తీర్చేందుకు చలివేంద్రం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని 12వ బెటాలియన్ కమాండెంట్ వీరయ్య అభినందించారు.మండుతున్న వేసవి వేడి నుంచి ఉపశమనం కల్పించేందుకు జగిని టెక్స్‌టైల్స్,జగిని దంత వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో అన్నెపర్తిలోని 12వ బెటాలియన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రయాణికులు,పాదచారులు ఎదుర్కొనే దాహాన్ని తీర్చేందుకు ఉచితంగా చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో జగిని టెక్స్‌టైల్స్,జగిని దంత వైద్యశాల సంయుక్త ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. డాక్టర్ జగిని ఆదిత్య,జగిని వెంకన్న,అదనపు ఎస్‌పి నాగేశ్వరరావు,డిఎస్పిలు,సీఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక చైతన్యానికి అస్తిత్వవాదాలే దిక్సూచి

**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** సామాజిక ఉద్యమాలలో సాహిత్య రంగంలో అస్తిత్వ వాదాల ప్రాముఖ్యత ఎప్పటికీ తగ్గదని,అవి సజీవ స్రవంతుల్లా నిరంతరం కొనసాగుతాయని ప్రముఖ కవి,విమర్శకులు డాక్టర్ పగడాల నాగేందర్ అభిప్రాయపడ్డారు.బుధవారం నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఎం.ఏ తెలుగు విద్యార్థులకు అస్తిత్వ ఉద్యమాలు ఆరంభ వికాసాలు అనే అంశంపై విస్తృతోపన్యాసం చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీవాద,దళిత,బహుజన,ముస్లిం మైనార్టీ,ప్రాంతీయ అస్తిత్వ వాదాలు కేవలం తాత్కాలిక ఉద్యమాలు కావని,అవి సమాజంలో పాతుకుపోయిన అసమానతలపై చేసే నిరంతర పోరాటాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, తెలుగు విభాగం అధ్యక్షులు డాక్టర్ వెల్దండి శ్రీధర్,వాస భూపాల్,టంగుటూరి సైదులు,అంజయ్య,లింగస్వామి,శ్రవణ్ కుమార్,వనజ ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# 50శాతం సబ్ కోటా కేటాయించాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మహిళ రిజర్వేషన్లలో బిసి మహిళలకు సబ్ కోటా జనాభా ప్రతిపాదికగా 50 శాతం కేటాయించాలని అందుకు అన్ని పార్టీలు బిసి మహిళలకు మద్దతుగా నిలవాలని అప్పుడే బిసిలకు న్యాయం జరుగుతుందని విన్నపం ఒక పోరాటం వ్యవస్థాపక అధ్యక్షురాలు, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు చికూరి లీలాగౌడ్ కోరారు. బిసి మహిళ నారిశక్తి గళం విప్పి పోరాటం సమయం వచ్చిందని, ఇప్పుడు మాట్లాడకపోతే అగ్రవర్ణాల మహిళలకే సీట్లను రిజర్వేషన్ చేసుకుంటున్నారని అన్నారు. ప్రతి ఒక్క బిసి గళం పార్లమెంట్‌కు చేరాలన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/త్రిపురారం:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని త్రిపురారం ఎస్ఐ కైగూర్ నరేష్ సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని కంపసాగర్ ఆదర్శ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా విద్యార్థులు,ఉపాధ్యాయులు మరియు స్థానికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మల్లికంటి వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయులు,పోలీస్ సిబ్బంది,విద్యార్థులు , స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సర్పంచులు, కార్యదర్శులకు అవగాహన



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు బుధవారం నేరేడుచర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 15వ ఆర్థిక సంఘం నిధులపై ఎంపిడివో సోమ సుందర్‌రెడ్డి మండలంలోని సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధుల వినియోగం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపివో నాగరాజు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# అవగాహన తప్పనిసరి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని తహసిల్దార్ స్రవంతి, ఎస్ఐ చలిగంటి నరేష్ లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామంలో ఆరైవ్ ఆలైవ్ భాగంగా ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మోడల్ స్కూల్ విద్యార్థులతో మానవహారం నిర్వహించి అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపిడివో సరోజ, మండల విద్యాధికారి చత్రునాయక్, ఎవో ప్రయతమ్‌కుమార్, సర్పంచ్ నాగలక్ష్మి , విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎన్‌జి కళాశాల పిజి తొలి సెమిస్టర్ ఫలితాలు విడుదల



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో పీజీ మొదటి సెమిస్టర్ (2025/26 విద్యా సంవత్సరం) పరీక్షా ఫలితాలను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్,పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.మునిస్వామి విడుదల చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎం.ఏ తెలుగు,ఎం.ఏ అర్థశాస్త్రం,ఎమ్మెస్సీ రసాయనశాస్త్రం,కంప్యూటర్ సైన్స్,జంతుశాస్త్రం,ఎంకామ్ కోర్సులకు సంబంధించిన ఫలితాలను కళాశాల అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.ఈఏడాది ఫలితాల్లో విద్యార్థులు గణనీయమైన ప్రతిభ కనబరిచారని,గత ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం మెరుగుపడినట్లు ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేశారు.ఫలితాలపై అసంతృప్తి ఉన్న విద్యార్థులు పది రోజులలోపు నిర్ణీత రుసుము చెల్లించి రీవాల్యుయేషన్ లేదా రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.పూర్తి వివరాల కోసం కళాశాల అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి. రవి కుమార్, ప్రొఫసర్ అంతటి శ్రీనివాసులు, అకాడమిక్ కోఆర్డినేటర్ బత్తిని నాగరాజు, పీజీ ఇన్‌చార్జీలు డాక్టర్ వెల్దండి శ్రీధర్,డాక్టర్ జ్యోత్స్న,జె.నాగరాజు,వెంకట్ రమణ,వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

విభాగాల వారీగా ఉత్తీర్ణత శాతం ఇలా ఉంది:
ఎం.ఏ తెలుగు84శాతం ఎం.ఏ అర్థశాస్త్రం 100 శాతం,ఎమ్మెస్సీ రసాయనశాస్త్రం 18శాతం,ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్68శాతం,ఎమ్మెస్సీ జంతుశాస్త్రం 84శాతం,ఎం.కామ్86శాతం.

# రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్‌లో శాస్త్ర విద్యార్థుల ప్రభంజనం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** 202526 విద్యా సంవత్సరంలో 'ఈఅభ్యాస్' నిర్వహించిన వివిధ రకాల రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో పట్టణంలోని శాస్త్ర హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి అవార్డులను కైవసం చేసుకున్నట్లు పాఠశాల ఛైర్మన్ మైనం చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులు హైద్రాబాద్‌లోని భారతీయ విద్యాభవన్‌లో పద్మశ్రీ అవార్డు గ్రహీత శాంతా సిన్హా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎస్ ఐవై ఆర్.కృష్ణారావు, ప్రముఖ వైద్యులు గురువారెడ్డిల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థులకు జాతీయ స్థాయి వసతులు కల్పిస్తూ నాణ్యమైన విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఇటువంటి పోటీ పరీక్షలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తాయని పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కరస్పాండెంట్ పాశం శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాశం సింధురెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

# ఎంజియు చరిత్ర విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం (ఎంజీయూ) చరిత్ర,టూరిజం విభాగం విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం నల్లగొండ పట్టణ పరిధిలోని పానగల్ ప్రాంతాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రసిద్ధి చెందిన ఛాయా సోమేశ్వర ఆలయం, పచ్చల సోమేశ్వర ఆలయం,స్థానిక మ్యూజియం, అలాగే పానగల్ ఉదయ సముద్రం తటాకాన్ని పరిశీలించారు.ఈ పర్యటన సందర్భంగా ఆచార్య విజయబాబు మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా విద్యార్థులు పురావస్తు శాస్త్రం, శిల్పకళా వైభవం, చారిత్రక ఆధారాలపై ప్రత్యక్ష అవగాహన పొందుతారని తెలిపారు.ముఖ్యంగా ఛాయా సోమేశ్వర ఆలయంలో కనిపించే ప్రాచీన సాంకేతికత, నిర్మాణ శైలి విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.అలాగే నాటి సంస్కృతి, సంప్రదాయాలపై కూడా విద్యార్థుల్లో అవగాహన పెరుగుతుందని చెప్పారు.ఈకార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పనస రామకృష్ణ, డాక్టర్ షరీఫ్,వివేక్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# బీర్ల ఐలయ్యపై అసత్య ప్రచారాలు చేస్తే సహించం

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా, పేద ప్రజల పెన్నిధిగా పనిచేస్తున్న ఆలేరు ఎమ్మెల్యే, తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యపై బిఆర్‌ఎస్ సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను డిసిసి అధికార ప్రతినిధి, హాజీపూర్ మాజీ సర్పంచ్ కవిత వెంకటేష్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. యాదాద్రి భువనగిరి బిఆర్‌ఎస్ (kcrcult2.0) ఇన్స్టాగ్రామ్, ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా ఎలాంటి ఆధారాలు లేకుండా ఎమ్మెల్యే పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. ఈ సందర్భంగా కవిత వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ బీర్ల ఐలయ్య నిరంతరం నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటూ, నియోజకవర్గ ప్రగతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఆయనకు ప్రజల పూర్తి మద్దతు ఉందని, ఇలాంటి చిల్లర ప్రచారాల వల్ల ఆయన ఇమేజ్ తగ్గదని స్పష్టం చేశారు. గత బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో బిఆర్‌ఎస్ నాయకులు ప్రజలను పట్టించుకోకుండా, ప్రజా ధనాన్ని దోచుకొని దాచుకున్నారని ఆరోపించారు.

# గ్రాడ్యుయేషన్ డే

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని ఒగోడు గ్రామ అంగన్వాడి కేంద్రంలోపోషణ పక్వాడలో భాగంగా బుధవారం చిన్నారులకు ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు.ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ పల్లెబోయిన లెనిన్ బాబు మాట్లాడారు అనంతరం అంగన్వాడి కేందర్రంలోని పిల్లల అభివృద్ధి మైలురాళ్లను గుర్తించడంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.పిల్లల అభివృద్ధిని అంచనా వేసి అసైన్మెంట్ కార్డ్స్ పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని,ఉపసర్పంచ్ పులి రేవతి లింగయ్య,అంగన్వాడి టీచర్లు జి కవితా రెడ్డి, పుట్ట శశికళ,నాగమణి తదితరులు పాల్గొన్నారు.



# దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/చండూరు :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టీఎస్‌డబ్ల్యూఆర్ జేసీఈటీ2026ప్రవేశ పరీక్షకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చండూరు సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.స్వామి తెలిపారు.2026/27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ పరీక్షను నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గురుకుల జూనియర్ కాలేజీలలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించబడతాయి.ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ప్రవేశ పరీక్షను మే 15న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష, అర్హతలు, దరఖాస్తు విధానం తదితర వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# బిసి మహిళలకు సబ్ కోటా కల్పించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించడం మంచి విషయమే కాని వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లు చట్టసభల్లో కల్పించకపోతున్నారని, మహిళా రిజర్వేషన్ బిల్లులోనైనా బీసీలకు సబ్ కోటా కల్పిస్తే ఎంతో మంది బీసీలు చట్టసభల్లో అడుగుపెట్టే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించి బీసీలకు న్యాయం చేయాలన్నారు. జనాభాలో సగభాగంకు పైగా ఉన్న బీసీలను రాజకీయ పార్టీల నాయకులు కేవలం ఓట్లు వేసే యంత్రాలుగానే చూస్తున్నాయని, ఇప్పటికైనా బలహీనవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రేవెల్లి గంగాధర్, ఉపేందర్, రమేష్, రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెకు సిద్ధం కావాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలని ఆర్టీసీ కార్మిక సంఘం జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ థామస్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. డిపో ఎదుట బుధవారం నిర్వహించిన గేటు ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. యాజమాన్యం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామి ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనట్లయితే అన్ని సంఘాలతో కలిసి ఈనెల 22న తొలి షిఫ్ట్ నుంచి సమ్మె నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో యాదయ్య, తన్నీరు పాండురంగయ్య, నరసింహా, కడియం రమేష్, జాబేర్, మహేందర్, రత్నం, సోమయ్య, అనిత, మధు, స్రవంతి, బేగ్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/రామన్నపేట :** బోగారం రైతన్నల కోసం వడ్ల మార్కెట్లో మహిళలు, రైతులు, కూలీల కోసం ఎండలో వారు పడే కష్టాన్ని తెలుసుకొని రైతన్నల కోసం గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ కూనూరు సాయి కుమార్ గౌడ్ చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బైకానీ ఉమామహేష్ యాదవ్, గోగు ప్రమీలరమేష్ యాదవ్, నేరటి మానస సురేష్ యాదవ్, వనం అండాలు యాదగిరి పాల్గొన్నారు.



## సుధాకర్‌కు దళిత రత్న అవార్డు

ప్రజాపక్షం/భువనగిరి : సమాన అవకాశాల కోసం సామాజిక సేవలు సాగిస్తున్న సందెల సుధాకర్‌కు దళిత రత్న అవార్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ దళిత రత్న అవార్డును సందెల సుధాకర్‌కు చైర్మన్ దొమ్మాటి సుదర్శన్ బాబు కో చెర్మన్ ఆలీ బిల్లీ మహేం దర్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో అందించారు. కుల మత బేధాలు లేకుండా ప్రతి రంగంలో ప్రజలను చైతన్యం చేసి ప్రజలందరూ సమానమని సంఘంలోకి సమాజంలోకి చైతన్యం చేసి నడిపిస్తున్న యువ నాయ కుడు సందెల సుధాకర్ బోనగిరి కేంద్రంగా అహర్నిశలు రాజకీయ నాయకునిగా రాజీలేని పోరాటం చేసి భువన గిరి ప్రాంతంలోనే అతి చిన్న వయసులో సర్పంచిగా. బోనగిరి జెడ్పిటిసిగా ప్రజలకు సేవలు అందించినందు కు ప్రభుత్వం అంబేద్కర్ ఈ అవార్డును అందజేశారు.

## అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/గుండాల; రాష్ట్రంలో రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండడంతో మండల ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డా. ప్రవీణ్‌కు మార్ ప్రజలకు సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవి కాలం మొదలై ఎండలు విపరీ తంగా ఉండడంతో మండల ప్రజలు అవసరం అయితే తప్ప బయటకు రావద్దని తెలిపారు. ఉదయాన్ని కావా ల్సిన పనులను ముగించుకొని ఇంటి వద్దే ఉండాలని అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఉన్న వారు ఎండ దెబ్బ తగలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సాధ్యమైనంత వరకు ఎక్కువ మోతాదులో నీరు త్రాగా లని తెలిపారు.

## రోగులకు పండ్లు పంపిణీ



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని బుధవారం దళిత నాయకులు, మాజీ కౌన్సిలర్ కొము శ్రీనివాస్ ఏరియా ఆసుపత్రి రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు బడుగు, బలహీనవర్గాలకు సమ గ్రంగా అందినప్పుడే అంబేద్కర్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు పోలేపల్లి రాము, మాతంగి యాద గిరి, దైద నాగరాజు, నాగేందర్, అరవింద్, బంటు శివ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాల పట్ల అవగాహన కార్యక్రమం

ప్రజాపక్షం/అర్వపల్లి : రోడ్డు భద్రత నియమాల పట్ల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని అర్వ పల్లి ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో చిల్డ్రన్స్‌డే స్కూల్‌లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ప్రత్యేక ర్యాలీ నిర్వహించి, మానవహార కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు, బస్సు ఎక్కేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. నేటి బాలలే రేపటి బావి భారత పౌరులని, రోడ్డు ప్రమాదాల పట్ల యువత మరణం చెందకూడదని సూచించారు. రోడ్డు నియమాల పట్ల అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి బాగోతం

నిబంధనలకు వ్యతిరేకంగా
భూమి బదలాయింపు
తనకు అధికారులు అన్యాయం చేశారని
బాధితుడు జహీర్ అహ్మద్ ఆవేదన



ప్రజాపక్షం/కోదాడ: కోదాడ మండలం ద్వారకుంట రెవిన్యూ పరిధిలోని 134 సర్వే నెంబర్‌లో గల ఐదు ఎకరాల రెండు కుంటల భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా రెవిన్యూ అధికారులు కోదాడకు చెందిన జలీల్‌నాయక్ పేరు పైకి మార్చారని బాధి తుడు జహీర్‌అహ్మద్ బుధవారం కోదాడ ఆర్డీవో కార్యాలయం ముందు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపి విలేకరుల సమావేశంలో రోధిస్తూ వెల్లడిం చారు. తన తల్లి అహ్మద్ ఉన్నిసాబేగం పేరా ఈ భూమి ఉందని గత ఏడాది జూలైలో సెల్ కం జిపిఎ డాక్యుమెంట్‌తో ఈ భూమిని నాలా కన్వర్షన్ మూటే షన్ చేశారని వాపోయాడు. తహసిల్దార్ కార్యా లయం పనిచేసి సస్పెండ్ ఐన ధరణి ఆపరేటర్ వెంక య్య ఈ దందాలో కీలక వ్యక్తి అని ఆరోపించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీ సీని యర్ నాయకులు ఒకరు తహసిల్దార్ పైకి ఒత్తిడి తీసు కవచ్చి వీరికి సహకరించారని తెలిపారు. ఈ భూమి పంచనామా సైతం ఆర్ఐ జగదీష్ భూమి వద్దకు వెళ్లి పక్కన రైతులతో కాకుండా వారికి అనుకూలమైన వ్యక్తులతో సాక్షిగా సంతకాలు చేయించి పంచనామా చేశారని, క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా ముదు పులు తీసుకుని రిపోర్టు ఇచ్చారని ఆరోపించారు. ఇదే విషయమై తనకు న్యాయం జరగాలని లోకా యుక్తను ఆశ్రయించానని బాధితుడు వాపోయాడు. స్థానిక తహసిల్దార్ వాజీద్‌అలీ నిబంధనలకు వ్యతిరే కంగా వ్యవహరించి భూమికిని తమకు కాకుండా చేశాడని, ఇప్పటికైనా పై అధికారులు స్పందించి తమకు న్యాయపరంగా చెందాల్సిన భూమిని అప్ప గించి అక్రమంగా భూమిపై హక్కులు కల్పించిన తహసిల్దార్, ఆర్ఐ పై శాఖ పరమైన చర్యలు తీసుకో వాలని కోరారు. తన తల్లి 2010లో మృతి చెందిన దని కాగా 2006లో జిపిఏ చేసిందని తెలిపారు. చని పోయిన తర్వాత 2025 జూలైలో అధికారులు జిపి ఎతో అన్యాయంగా మ్యుటేషన్ చేశారని తెలిపారు. వ్యక్తి చనిపోయిన తర్వాత జిపిఎ చెల్లదని అధికారు లకు తెలిసిన ముడుపులతో చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అవినీతి అ క్రమాలకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని బాధితుడు ఆరోపించారు.

## యువత అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగించాలి



ప్రజాపక్షం/మునగాల : నేడు యువత సమాజం ఎడల అంకితభావంతో ఉండి సామాజిక సేవలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జగ్జీవన్ రామ్ స్ఫూర్తిని కొనసాగించాలని కోదాడ డిఎస్‌పి ఆర్. శ్రీనివాసరెడ్డి యువతకు పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబే ద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా కొక్కిరేణి గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ శంకుస్థాపన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అంబేద్కర్ యువసేన నాయకులు ములకలపల్లి కార్తీక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఎన్నో కష్టాలు ఎదుర్కొని కష్టపడి చదువుకొని భారత రాజ్యాంగాన్ని రచించడం అంటే ఆయన ఎంతో చదు వుకు ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి జి.లత, స్థానిక ఎస్ఐ బి. ప్రవీణ్ కుమార్, ఏఎస్‌డబ్లు బానా వత్ రావాయి, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు చింత లపాటి చిన్నశ్రీరాములు, టిఎన్‌జిఒస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దున్న శ్యామ్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమల్ల హసేన్, మునగాల మాజీ ఎంపిపి జడ్‌పిటిసి ములకలపల్లి రాములు తదిత రులు పాల్గొన్నారు.

## సిరి విత్తనాలతో అధిక దిగుబడులు

ప్రజాపక్షం/మోటకొండూర్ : సిరి సీడ్ 2288 స్టార్ హైబ్రిడ్ వరి వంగడాలతో అధిక దిగుబడులు సాధిస్తున్నా మని ఆబిద్ నగర్ సర్పంచ్ నాయిని అమరావతి రామచం ద్రారెడ్డి అన్నారు. బుధవారం వారు మోటకొండూరు మండలంలోని ఆబిద్ నగర్, చామాపూర్‌లలో సిరి సీడ్స్ క్షేత్రస్థాయి సమావేశాలలో పాల్గొని మాట్లాడుతూ సిరి సీడ్స్ కంపనీ ప్రారంభించి 25 వసంతాలను దిగ్విజ యంగా పూర్తి చేసుకున్నదని, మా సిరీ సీడ్స్ కంపెనీకి విత్త నాలు అధిక దిగుబడులు వస్తున్నాయని అన్నారు. సిరి 2288 స్టార్ హైబ్రిడ్ రకం ఎకరానికి 35 నుండి 40 క్వింటాళ్ల దాన్యం దిగుబడి అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రైతు యెగమాటి వెంకట్ రెడ్డి సిరి విత్తనాలు వాడి అధిక దిగుబడులు సాధించినం దుకు శాలువాలతో సన్మానించారు. భువనగిరి మార్కెట్ సెల్స్ అధికారి పుల్లే మల్లేష్, రైతులు ఎగమాటి వెంకట్ రెడ్డి, రంగారెడ్డి సంజీవ రెడ్డి, పడటం యాదగిరి, వల్లాల ఉప్పలయ్య పాల్గొన్నారు.



## అసత్య ప్రచారాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/ఆలేరు : బిఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికలైన ఇన్స్టాగ్రామ్ ద్వారా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రతి ష్టను దెబ్బతీసేలా అసత్యాలతో కూడిన పోస్టులు చేస్తూ ప్రజలకు తప్పుడు సందే శాలు ఇస్తున్నారని మాజీ ఎంపీపీ గంధ మల్ల అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తూ యాదగిరిగుట్ట డీఏస్పీ, ఆలేరు ఎస్హెచ్ఓలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో బైరాన్ నగర్ సర్పంచ్ కంపరాజు వెంకటేశ్వరరాజు, మండల నాయకులు కంతి నాగరాజు, వీరభద్రం రాజు తదిత రులు పాల్గొన్నారు.






## పేదలకు ఉచిత పెరుగు అన్నం పంపిణీ

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: వేసవికాలంలో పట్టణంలో ప్రతిరోజు మధ్యాహ్నం 3వేల మందికి ఉచితంగా పెరుగు అన్నం పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం రెండవ రోజు పట్టణంలోని పేదలకు పెరుగు అన్నంను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాధవి దంపతులు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వేసవికాలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలకు, రైతులకు ఉపశమనం కోసం ప్రతిరోజు మధ్యాహ్నం 3వేల మంది పంపిణీ చేయడం జరు గుతుందన్నారు. ఈ కార్యక్రమం జూన్ 2వరకు కొనసాగుతుంద న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధాభా లక్ష్మీష్ట, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీషనవీన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులను పరిష్కారం చూపాలి



ప్రజాపక్షం/డిండి; భూ భారతి పేరుతో గ్రామాల్లో అంగు ఆర్భాటా లతో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరం గడుస్తున్నా రైతులకు పరిష్కారం లభించకపోవడం దారుణం అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి అన్నారు. బుధవారం ప్రజా సమస్యలు తెలుసుకోవడంకై ఇంటిం టికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా రహమంతాపూర్ గ్రామంలో పర్యటించారు. రైతుల భూ భారతి దరఖాస్తులు పరిష్కారం కావడం లేదని తహశీల్దార్ కార్యాలయం చుట్టూ రైతులు తమ పనులను వది లేసి ఆఫీసు వద్ద పడిగాపులు కాస్తున్న పరిష్కారం లభించడం లేదని రైతులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్తున్న క్రమంలో సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దీన్, మండల కార్యదర్శి కనకాచారి, ఏఐ వైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, మండల కార్యవర్గ సభ్యులు శ్రీనయ్య, సర్పంచ్ రాములమ్మ, ఉప సర్పంచ్ రమేష్, గ్రామశాఖ కార్యదర్శి శివ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

ప్రజాపక్షం/చింతలపాలెం : మండల కేంద్రంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తిరుమల ప్రసన్న వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహో త్సవం కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. ఈ పూజా కార్యక్రమంలో ఎస్ఐ సందీప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి పాల్గొని మాట్లా డుతూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యతను బలపరు స్తాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకులు యర బోలు మోహన్ రెడ్డి, వీరంరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, యర్రం శంభిరెడ్డి, కాకునూరి రామిరెడ్డి, గోనె అంకయ్య, వీరంరెడ్డి నరేందర్ రెడ్డి, కందుల శ్రీనివాసరెడ్డి, దొంగల అంకరాజు, వీరంరెడ్డి వీరారెడ్డి, చుట్టాకుల కొండ, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ఉపాధి పనుల పరిశీలన

**ప్రజాపక్షం/రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్ర పాలన గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పనులను అడిషనల్ డిఆర్‌డివో పరిశీలించారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్, ఏపీవో, ఈసీ, పంచాయతీ కార్యదర్శి యఫ్‌ఏలు పాల్గొన్నారు.

## డిఏ విడుదల చేయాలి

**ప్రజాపక్షం/మోతె :** ప్రభుత్వం బాకీ ఉన్న డిఏ అరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని టిఎస్‌సిపిఎస్‌ఇయు జిల్లా అధ్యక్షులు లక్కపాక ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తహశీల్దార్ యం. వెంకన్నకు, ఎంపిడిఓ ఆంజనేయులుకు ఉద్యోగుల సంఘం సభ్యత్వం అందించారు.

## పోలీస్ స్టేషన్‌కు ఓపెన్ పరీక్షా ప్రశ్నాపత్రాలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 20న ప్రారంభం కానున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ సార్వత్రిక విద్యాపీఠం పదవ తరగతి, ఇంటర్ పరీక్షా ప్రశ్నాపత్రాలు బుధవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పేపర్ కస్టోడియన్లు గుడిపాటి కోటయ్య, నెహ్రూల ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారుల సమక్షంలో డిపాజిట్ చేసి లాకప్‌కు తాళం వేసి సీలు వేశారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు ఏలేటి వినోద్‌కుమార్, వెంకట్‌రెడ్డి, అశోక్‌కుమార్, కృష్ణకాంత్, వెంకన్న, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు పట్టణంలో ఏబీవీపీ (అఖిల భారతీయ విద్యార్థి పరిషత్) పూర్వ కార్యకర్తల ఆధ్వర్యంలో ఐదో వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికయిన పాశికంటి సంపత్ ఏర్పాటు చేసిన అభినందన సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ ఏబీవీపీ పూర్వ విద్యార్థులు గురువారం ఆలేరు రహదారి బంగ్లాలో అభినందన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ అభినందన సభను ఈ నెల 19వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఆలేరు పట్టణంలోని కమలమ్మ జనార్ధన్ గార్డెన్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆలేరు ప్రాంతంలో పనిచేసిన ఏబీవీపీ పూర్వ కార్యకర్తలందరూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# హామీలు అమలు చేయకపోతే 22 నుంచి సమ్మె



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఆర్‌టిసి కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఈ నెల 22వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్ రెడ్డి హెచ్చరించారు.ఆర్‌టిసి కార్మికుల ప్రయోజనాల కోసం అన్ని సంఘాలు ఈ సమ్మెకు మద్దతు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. సమ్మె సన్నాహకాల్లో భాగంగా బుధవారం ఉదయం నల్లగొండ ఆర్‌టిసి డిపోలో జేఏసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించి, సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్‌టిసి పట్ల వివక్ష చూపిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆర్‌టిసిని నిర్వీర్యం చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు.రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విలీనం కోసం కమిటీ ఏర్పాటు చేశామని చెప్పడం విచిత్రమని,2023లో ఏర్పాటైన కమిటీ వివరాలనే ఇప్పుడు ప్రస్తావించడం హాస్యాస్పదమని విమర్శించారు. రాష్ట్ర నాయకులు బోయపల్లి యాదయ్య, బి.నరేందర్,బాసాని వెంకటయ్య మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని, 2021 మరియు 2025 వేతన సవరణలను అమలు చేయాలని, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆర్టీసీకి సబ్సిడీపై ఇవ్వాలని, అధిక పనిభారాన్ని తగ్గించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎన్ఆర్‌సీ రాజు,టీజే రావు,యార చంద్రయ్య,కొర్ర లింగా నాయక్ ,ఈఎస్ రెడ్డి,వీఎస్ రెడ్డి, ఏఎల్ స్వామి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రోడ్డు భద్రత అందరి బాధ్యత అని రోడ్డు నియమాలు పాటిస్తే ప్రాణాలు కాపాడవచ్చు అని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ సూచించారు.ప్రజా పాలన,ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా పిల్లల రోడ్డు భద్రత దినోత్సవం సందర్భంగా పోలీస్ ఆధ్వర్యంలో చేపట్టిన అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం బుధవారం మూడో రోజు పట్టణంలోని డివికె రోడ్ లో గల మౌంట్ ఫోర్ట్ స్కూల్ లో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉంటే ప్రమాదాలు తగ్గుతాయని తల్లిదండ్రులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా విద్యార్థులు ప్రేరేపించాలని సూచించారు.హెల్మెట్ లేని ప్రమాదాల్లో జిల్లాలో ప్రతి సంవత్సరం ప్రాణ నష్టం ఎక్కువగా జరుగుతుందని జీబ్రా క్రాసింగ్ వినియోగం,ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, సీట్ బెల్ట్ వినియోగంపై స్పష్టమైన అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి,ట్రాఫిక్ సిఐ మహా లక్ష్మయ్య,ఎస్ఐలు గోపాల్ రావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్

**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** లక్ష్యాలకు తగ్గట్లుగా వసూళ్లు జరగకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర హెచ్చరించారు.ప్రజా పాలన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం నగర పాలిక కమిషనర్ బి.శరత్ చంద్ర ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి.ప్రాపర్టీ ట్యాక్స్ ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల పురోగతిని నేరుగా పరిశీలన చేసి డివిజన్ 46లో ట్రేడ్ లైసెన్స్ వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టి సారించా రు.అనంతరం ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.డివిజన్ 30,48 ల్లో ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వెంటనే వసూళ్లు పెంచాలన్నారు.



## వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవ కల్యాణ మహోత్సవాల ఆహ్వాన పత్రం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నకిరేకల్:** శ్రీ గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షికోత్సవ కళ్యాణ మహోత్సవాల ఆహ్వాన కరపత్రాన్ని ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుండి 26 వరకు వైభవంగా కళ్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోపురి చంద్రమౌళి,ధర్మకర్తలు సంకోజు నారాయణ,తాటికొండ లక్ష్మయ్య,సిద్ధోజు భిక్షమాచారి,బహురోజు ఇందిర,రాం బ్రహ్మచారి,మురళి,రామకోటి, విశ్వజ్ఞాచారి,శ్రీనివాస చారి,నాగరాజు,సత్యనారాయణ,సోమయ్య చారి,నాయకులు చౌగోనీ శ్రీనివాస్, లింగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ కార్యదర్శుల ఫిర్యాదుపై జరగని విచారణ

**ప్రజాపక్షం/నకిరేకల్(శాలిగౌరారం):**ఎంపీడీవో డబ్బుల కోసం తమను ఇబ్బందికి గురి చేస్తుందని మండల సెక్రెటరీలు ఇటీవల జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.బుధవారం శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయానికి నల్లగొండ ఆర్‌డిఓ అశోక్ రెడ్డి,డిపిఓ శంకర్ నాయక్ చేరుకొని విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా ఆర్‌డిఓ అశోక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గతంలో శాలిగౌరారం పంచాయతీ సెక్రెటరీ ఎంపీడీవోకు జరిగిన గొడవ మీద విచారణ చేశామని,విచారణ రిపోర్టును జిల్లా కలెక్టర్ కు అందజేస్తామని తదుపరి చర్యలు కలెక్టర్ తీసుకుంటారని తెలిపారు.కలెక్టర్‌కు, పంచాయతీ సెక్రెటరీలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టలేదని తమకు దళిత సంఘాల నాయకులు కూడా ఫిర్యాదు చేశారని అన్నారు.దళిత సంఘాలు ఇచ్చిన ఫిర్యాదు పై కూడా విచారణ చేస్తామన్నారు.దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎంపీడీవో పై విచారణ చేపట్టాలని తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**ప్రజాపక్షం /పెన్ పహాడ్:** రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని పిల్లలమర్రి గ్రామ శివారులో బైపాస్ రోడ్ లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ జావేద్ (49) తన సొంత వాహనం టి జి 09 ఎ ఎం 1245 లో బుధవారం ఖమ్మం నుండి హైదరాబాద్ కు వెళ్తుండగా మండలంలోని పిల్లలమర్రి సమీపంలో లోని ఎన్ హెచ్ 65 బిబి పైన బర్రెలు అడ్డం రాగా వాడిని తప్పించే క్రమంలో కారు అదుగుతప్పి ఎడమవైపు ఉన్న డివైడర్ ను ఢీకొని ఫల్టీ కొట్టింది. దీంతో కారు నడుపుతున్న జావీద్ కు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు మహమ్మద్ వాజిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ బాలునాయక్ తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి**



**ప్రజాపక్షం / పెన్ పహాడ్ :** రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మండలంలోని జానారెడ్డి నగర్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హుజూర్ నగర్ చెందిన ఏ ఆర్ కానిస్టేబుల్ వల్లపు దాసు సైదులు (36) సూర్యాపేట ఎస్ పి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. గరిడేపల్లి మండలం పొనుగోడు ఉన్న తన బంధువుల ఇంటికి బైక్ పై వెళ్లి తిరిగి సూర్యాపేటకు వస్తుండగా జానారెడ్డి నగర్ సమీపంలో ఆగి ఉన్న ఆగి ఉన్న ట్రాక్టర్ ను వెనక నుండి ఢీకొట్టాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం సూర్యాపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ ఐ గోపికృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యం



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని పోలేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రజా ప్రతినిధులు , అధికారులతో కలిసి ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండలంలోని లోయపల్లి, సూర్యానాయక్ తండ, కాసర్లపాడు, అర్వపల్లి, పర్సాయిపల్లి గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ప్రజాప్రతినిధులుతో కలిసి అధికారులు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాలకు చెందిన సర్పంచులు వల్లపు గంగయ్య, కేలోత్ కాంతమ్మహరిలాల్, రుణావత్ కృష్ణ, మంచాల లలితరామ్మూర్తి, చిల్లంచర్ల విద్యాసాగర్, బైరబోయిన మహారాజు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్)) :** ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరతోపాటు, బోనస్‌ను పొందేందుకు రైతులు ఐకెపి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూర్(ఎస్) మండలంలోని బోట్యతండలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామ సర్పంచ్ భూక్యా అరుణమల్సూర్, భూక్య వెంకన్న, ధరావత్ నాదం, శంకర్ నాయక్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని కొమ్మాయిపల్లి, వెల్మజాల, సీతారాంపురం, వంగాల, పెద్దపడిశాల, బండకొత్తపల్లి, గంగాపురం, నూనెగూడెం గ్రామాలలోని ఐకేపి కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లను బుధవారం మోత్కూర్ మార్కెట్ కమిటి చైర్మన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మండలంలో ప్రారంభం చేసిన ఐకెపి కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభం చేయాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, మండల నాయకులు తునికి సాయిలు, గోపగాని రమేష్, గోపగాని వెంకన్న, భాస్కర్ పాల్గొన్నారు.